ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబరు 2023
5
శ్రీకాకుళం



తప్పని డోలీ మోత

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఆధునికత సంతరించుకుని రవాణా వ్యవస్థల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్న ఈ రోజుల్లోనూ ఆదివాసులకు డోలీ మోతలు తప్పడం లేదు. తరాలు మారినా, పాలకులు మారినా అడవి బిడ్డల బతుకులు మాత్రం మారడం లేదనడానికి మండలంలోని కేరాసింగిలో ఆదివారం చోటుచేసుకున్న డోలీ మోతే నిదర్శనం. గిరిజన ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ దుస్థితికి ఈ ఘటన అద్దం పడుతోంది. కొండలపై ఉన్న కేరాసింగి గ్రామానికి చెందిన గర్భిణి గొడ్డారు తనూజకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. నొప్పుల తీవ్రత పెరగడంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబసభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. ఆ గ్రామానికి నేటికీ పూర్తిస్థాయి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గ్రామంలోకి వెళ్లే వీల్లేక కిలోమీటరు దూరంలోనే 108 వాహనం ఆగిపోవాల్సి వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు మంచం డోలీ కట్టి కొండపై నుంచి 108 వాహనం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను మెళియాపుట్టిలో ఆస్పత్రికి తరలించారు. వైద్యం, ఇతర అత్యవసర సమయాల్లో గిరిజనులకు ఇలాంటి అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



డోలీ సహాయంతో కొండపై నుంచి గర్భిణిని తీసుకొస్తున్న గ్రామస్తులు

ఎండుతున్న పంట పొలాలు

- నాలుగేళ్లుగా అందని వంశధార నీరు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆందోళనలో రైతన్నలు
- మోటార్ల సహాయంతో చి'వరి' ప్రయత్నం

వర్షాభావ పరిస్థితులతో ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇటు వర్షాల్లేక, అటు వంశధార నీరు రాక పంట పొలాలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. వరి పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. నాలుగేళ్లుగా వంశధార నీరు అందడం లేదని, ఇప్పుడు కూడా అందించకపోతే ఇక వరిపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార అధికారులు మాత్రం ఈ ఏడాది నీరందించలేమని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లో చెరువులు, గెడ్డలు, కుంటల్లో నీటిని మోటార్ల సహాయంతో పంట భూములకు పెడుతున్నారు.

ప్రజాశక్తి - పలాస

వంశధార ప్రధాన ఎడమ కాలువ 12 మండలాల్లోని 398 గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,023 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువ నీరు 60 శాతం, వర్షపు నీరు 40 శాతం కలిపి 2,480 క్యూసెక్కుల సాగునీరు అందించాల్సి ఉంది. నందిగాం మండలం శివారు ప్రాంతం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో సుమారు 12 వేల ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. నాలుగేళ్లుగా వంశధార నీరు అందడం లేదు. ఏటా దీనిపై రైతులు గగ్గోలు పెడుతున్నా, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

జాడ లేని వంశధార

ఖరీఫ్ సీజన్‌లో రైతులు అష్టకష్టాలు పడి ఎదలు, ఊబాలు వేశారు. ప్రతి ఏడాదీ వంశధార నీరు అందక, వర్షాలు సకాలంలో కురవక వ్యవసాయం చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబరు నెల సగం రోజులు గడిచినా, వంశధార జాడే కనిపించడం లేదు. పాలకులు, అధికారులు వంశధార భూములకు సాగునీరు అందిస్తున్నామని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో పంట భూములకు సాగునీరు అందడం లేదు. ప్రతి ఏడాది ఖరీఫ్ నాటికి వంశధార అందిస్తామని అధికారులు రైతుల నుంచి నీటితీరువా వసూలు చేస్తున్నారు. నీరందించడంలో మాత్రం విఫలమవుతున్నారు. గతేడాది రైతుల నుంచి సుమారుగా రూ.28.48 లక్షలు నీటితీరువా వసూలు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. వంశధార నీరు ఇవ్వలేనప్పుడు నీటి తీరువా ఎందుకు వసూలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.



చెత్తా చెదారంతో నిండిన వంశధార కాలువ



నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలు



మోటరుతో పొలాలకు సాగునీరు పెడుతున్న రైతులు

మోటార్లతో పంట భూములకు సాగునీరు

పలాస మండలంలో సుమారు 9,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో సాగునీరు అవసరం. వర్షాభావ పరిస్థితులతో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు గంటకు రూ.400 చొప్పున చెల్లించి మోటార్ల సహాయంతో నీరు పెడుతున్నారు. ఇప్పటికే వరి సాగు కోసం వేలకు వేలు పెట్టుబడి పెట్టామని, చివరి దశలో పంట పాడైతే నష్టాల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదు



సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు పాడవుతున్నాయి. ఎండలు విపరీతంగా ఉండడంతో నీరు లేక పంట పొలాలు బీటలు వారిపోతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచీ ఇబ్బందులు తప్పడం లేదు. పంటకు పెట్టిన పెట్టుబడులూ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు చొరవ చూపి పంట భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

- వి.యాదగిరి, రైతు, బ్రాహ్మణతర్లా, పలాస

నాలుగేళ్లుగా వంశ'ధార' లేదు



నాలుగేళ్లుగా వంశధార నీరు రావడం లేదు. పంట భూములకు నీటి తీరువా మాత్రం వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటకు నీరు అవసరం. తప్పనిసరి పరిస్థితుల్లో గెడ్డలు, చెరువుల్లో మోటార్ల సహాయంతో పంట పొలాలకు నీరు పెడుతున్నాం.

- యవ్వారి వైకుంఠరావు,గోపాలపురం, పలాస

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

టెక్కలి మండలం మదనగోపాల సాగరం వరకే వంశధార నీరు వచ్చింది. సాగరం నిండితే గానీ ఇతర ప్రాంతాలకు వంశధార నీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుత పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- ప్రేమ్ కుమార్, ఎఇఇ, వంశధార



సత్యం మాస్టారు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

సత్యం మాస్టారు ఆశయసాధనకు కృషి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కొల్లి సత్యం మాస్టారు ఆశయసాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సత్యం మాస్టారు సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్బంధాలను ఎదిరించి ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడని కొనియాడారు. ఆరేళ్ల పాటు జైలు జీవితాన్ని అనుభవించారని, ఎమర్జెన్సీ కాలంలో 19 నెలలు జైల్లో ఉన్నారని తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా చివరి వరకు పార్టీ అభివృద్ధి కోసం పాటుపడ్డారని కొనియాడారు. సత్యం మాస్టారు మందస, సోంపేట ప్రాంతాల్లో కార్మిక, రైతాంగ ఉద్యమాలు నిర్మించారని గుర్తుచేశారు. ఈనెల 18న సత్యం మాస్టారు సంతాప సభను మందసలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత సత్యం మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి, కె.శ్రీనివాసు, కె.అప్పారావు, బి.మోహనరావు, పి.తేజేశ్వరరావు, టి.తిరుపతిరావు, గోవర్ధన్, వెంకట్రావు పాణిగ్రాహి, శ్రీదేవి, పి.కామినాయుడు, ఎ.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బలిపీఠంపై భావ స్వేచ్ఛ

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ప్రజాస్వామ్యానికి భారతదేశం పుట్టినిల్లు అనే కీర్తి నానాటికీ దిగజారిపోతోందని, భావస్వేచ్ఛ బలిపీఠంపై ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో గల ప్రెస్‌క్లబ్‌లో 'బలిపీఠంపై భావస్వేచ్ఛ' అంశంపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన భావవ్యక్తీకరణ హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదన్నారు. ఈ హక్కు ప్రమాదంలో పడితే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని హెచ్చరించారు. ఇటీవల దేశవ్యాప్తంగా మీడియా, న్యాయవాద, ప్రజాసంఘాలకు చెందిన ప్రతినిధుల ఇళ్లల్లో సోదాలు, నమోదైన కేసులు, నాన్‌బెయిలబుల్ అరెస్టులు ప్రజాస్వామ్యానికి వినిపిస్తున్న ప్రమాద సంకేతాలని చెప్పారు. విమర్శనాత్మక జర్నలిజానికి పెనుముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా కొన్ని ప్రభుత్వాలు ఇటువంటి దాడులు చేసినా, ప్రస్తుత మోడీ ప్రభుత్వం ఈ దాడులను తీవ్రతరం చేసిందని విమర్శించారు. ఈ పరిస్థితిపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు... ప్రశ్నించే గొంతులను నొక్కేసే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, మహిళల భద్రతకు పెనుముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రస్తుతం నియంతృత్వం రాజ్యమేలుతుందని విమర్శించారు. ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నరసింహులు మాట్లాడుతూ ప్రశ్నించే వాళ్లను మౌనంలోకి నెట్టడమే కేంద్ర ప్రభుత్వ వ్యూహమన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మకానికి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు చిక్కాల గోవిందరావు, కవయిత్రి ఎర్రమ్మ, జర్నలిస్టు సంఘాల నాయకులు ఎన్.ఈశ్వరరావు, కూన పాపారావు, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నిర్వహణ సామగ్రిని భద్రపరిచేందుకు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇవిఎం గోదాములను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదివారం తనిఖీ చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 20 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఇవిఎంల మొదటి దశ తనిఖీలను బెంగుళూరుకు చెందిన బిఇఎల్ ఇంజినీర్లు చేపట్టనున్నారని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు మొదటి దశ ఇవిఎంల తనిఖీలకు రోజూ హాజరు కావాలని సూచించారు. ఇప్పటికే ఆయా పార్టీలకు సమాచారం అందించామన్నారు. ఇవిఎం గోదాముల వద్ద కట్టుదిట్టమైన భద్రతను, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. జిల్లాకు మొదట విడతలో వివి ప్యాట్స్ 7,080, కంట్రోల్ యూనిట్స్ 5,831, బ్యాలెట్ యూనిట్స్ 7,523 చేరుకున్నాయన్నారు. ఇవిఎంల తనిఖీల నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్, ఇయర్ పాడ్స్ లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఏర్పాటు చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేయాలని చెప్పారు. ఇవిఎంల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్, డిప్యూటీ తహశీల్దార్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి రాధిక

మెడిసిన్ సూపర్ స్పెషాల్టీలో మెరిసిన సాగర్

ప్రజాశక్తి - ఆమదాలవలస



పొన్నాడ సాగర్

ఆలిండియా మెడిసిన్ సూపర్ స్పెషాలిటీ ఎంట్రన్స్ పరీక్షలో మండలంలోని గట్టుముడిపేటకు చెందిన పొన్నాడ సాగర్ 200 ర్యాంకు సాధించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు పట్టణంలోని టింపని హైస్కూల్‌లో విద్యనభ్యసించిన సాగర్, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదివారు. ఎంబిబిఎస్ విజయనగరం మహారాజా కాలేజ్‌లో, పిజి జనరల్ మెడిసిన్ కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. ఆయన తండ్రి కీ.శే పొన్నాడ రాజేష్ పట్టణంలో ఆర్‌ఎంపిగా, ప్రజా వైద్యునిగా సేవలందించారు. తల్లి ఉమాదేవి గృహిణి. సాగర్ ర్యాంకు సాధించడంపై కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో తెరిస్తే చర్యలు తప్పవని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలకు వర్క్‌షాపులు, సిలబస్ పూర్తి కాలేదని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు వంటివి నిర్వహిస్తున్నట్లు కమిషన్ దృష్టికి వస్తే అటువంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదులను నేరుగా మండల, జిల్లా విద్యాశాఖాధికారులతో పాటు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 0863-2444270, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఫోన్ నంబరు 9013133636, చైల్డ్‌లైన్ 1098, 1092 కాల్ సెంటర్‌తో పాటు secy.se.edn@gmail.com, apscpcr2018@gmail.com ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

యువతకు అబ్దుల్ కలాం స్ఫూర్తి

ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మాజీ రాష్ట్రపతి కీ.శే ఎపిజె అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి వేడుకలతో పాటు ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని మునసబుపేటలోని గురజాడ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం నిరుపేద కుటుంబంలో పుట్టినా, ఆయన సాధించిన విజయాలు ప్రపంచ దేశాలు కీర్తించే స్థాయికి తీసుకెళ్లాయన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఏ వసతుల్లేని కాలంలో ఆయన బాల్యం సాగిందని, అయినా అధైర్యపడకుండా ఉన్నత విద్యనభ్యసించారని తెలిపారు. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

సమయం ఎంతో విలువైందని, చదువుకునే సమయంలో సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనూ చదువుపై అదే ధ్యాస కలిగి ఉండేవారని చెప్పారు. అట్టడుగు స్థాయి నుంచి దేశంలోనే అత్యున్నత స్థానమైన రాష్ట్రపతిగా, అద్భుత శాస్త్రవేత్తగా ఎదిగారని, దేశానికి ఎనలేని సేవలు అందించి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. దానేటి శ్రీధర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు రూ.20 లక్షల నిధి ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, లయన్స్ క్లబ్ సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, పూర్వ అధ్యక్షులు బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు. అనంతరం దానేటి శ్రీధర్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.



'న్యాయానికి సంకెళ్లు' నిరసన

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో ఆదివారం నిరసన చేపట్టారు. 'న్యాయానికి సంకెళ్లు' పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చేతులకు తాళ్లు, రిబ్బన్లతో సంకెళ్లు వేసుకుని రాత్రి 7 నుంచి 7.05 గంటల వరకు నిరసన వ్యక్తం చేశారు. ఆ దృశ్యాలను వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తన క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి చేతులకు తాళ్లు, రిబ్బన్లు కట్టి నిరసన తెలిపారు. చంద్రబాబుకు ప్రాణహాని తలపెట్టాలని వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నగరంలోని గుజరాతీపేటలో చేపట్టిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఆమదాలవలస పట్టణంలో టిడిపి కార్యాలయం నుంచి వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు టిడిపి శ్రేణులతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ర్యాలీగా వెళ్లి చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, కిల్లి సిద్ధార్థ, ఇంజరాపు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. కవిటి మండలంలోని రామయ్యపుట్టుగలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి నాయకులు చేతులకు సంకెళ్లతో నిరసన తెలిపారు. జాడుపుడి ఆర్‌ఎస్‌లో టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మానిచంద్ర ప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో తదితరులు పాల్గొన్నారు. పలాస మండలంలోని రెంటికోటలో చేపట్టిన నిరసనలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి కార్యాలయంలో సీనియర్ నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, సప్ప నవీన్, పైల చక్రధర్ చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. బ్రాహ్మణతర్లాలో టిడిపి నాయకులు వి.యాదగిరి, ఆళ్ల వెంకటరావు తదితరులు నిరసన తెలిపారు. ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి వద్ద టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, ఆసీ లీలారాణి, సహదేవ్‌రెడ్డి తదితరులు చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. రణస్థలంలో టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో దేవరపల్లికి చెందిన మహిళలు, గ్రామస్తులు, యువకులతో కలిసి చేతికి సంకెళ్లు వేసుకొని ఊరేగింపు నిర్వహించారు.

పొందూరు పట్టణంలోని గాంధీనగర్‌లో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యాన, మొదలవలసలో ఎంపిటిసి మొదలవలస సీతారామారావు ఆధ్వర్యంలో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి, నాయకులు మద్దెల శ్రీనివాసరావు, కాళ్లకూరి శాంతారాం తదితరులు పాల్గొన్నారు. లావేరు మండలం తాళ్లవలసలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, లావేరులో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, బెజ్జిపురంలో మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, తామాడలో మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసురావు, రావివలసలో పార్టీ సీనియర్ నాయకులు దారపురెడ్డి కూర్మారావు, అదపాకలో మాజీ ఎంపిపి మీసాల శాంతమ్మ, రమణ ఆధ్వర్యాన చేతులకు తాళ్లతో కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.



కవిటి : చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే అశోక్



ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న కూన రవికుమార్



శ్రీకాకుళం అర్బన్ : చేతికి సంకెళ్లతో టిడిపి నాయకులు నిరసన

చేతుల పరిశుభ్రతకు ప్రాధాన్యం



పోలాకి : అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరరావు

ప్రజాశక్తి- పోలాకి

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సూచించారు. వెలుగు కార్యాలయంలో ఎపిఎం జి.రాజారావు ఆధ్వర్యాన అంతర్జాతీయ హ్యాండ్ వాష్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, వివిధ రకాల పనులు చేసి తదుపరి చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. అలా చేయకపోతే వివిధ రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంతలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ, వైసిపి మండల యువజన అధ్యక్షులు ఆర్.త్రినాథరావు, డిపిఎం వైకుంఠరావు, ఎపిఎం రాజారావు, అకౌంటెంట్ సత్యవతి, వెలుగు సిసిలు, సిఎ నీరజ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పరిసరాల పరిశుభ్రతతో పాటు మానవుల వ్యక్తిగత పరిశుభ్రతే మానవాళికి పరమాయువని వైయస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆదివారం మండలంలోని మునగవలస గ్రామ సంఘం అధ్యక్షురాలు గొర్లె ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన దన్నానపేట రైతు, మహిళా సంఘ సభ్యులతో పరిశుభ్రంగా చేతులు కడిగించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్థానికంగా మహిళలు హ్యాండ్ వాష్ లిక్విడ్స్, సబ్బులు తయారీ కోసం ఆసక్తి ఉండి యూనిట్లను స్థాపించుకోవడానికి ముందుకు వస్తే మహిళా సంఘ సభ్యులకు అవసరమైన రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో విఒఎ రమణమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారులు, మహిళా స్వయం శక్తి సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలో మదనాపురం గ్రామంలో ప్రపంచ చేతులు శుభ్రపర్చుకునే దినోత్సవం సందర్భంగా ఆదివారం మదనాపురం గ్రామంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు ఆధ్వర్యంలో గ్రామంలో మహిళా స్వయంశక్తి సంఘాలకు చేతులు శుభ్రపర్చుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క మహిళ వంటింట్లో పనిచేస్తూ శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకోవడం వలన అనేక అనర్థాలకు గురవుతారని, ప్రతి ఒక్కరు భోజనం చేసే ముందు చేతులను శుభ్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దుప్పాడ వెంకట అప్పలనాయుడు, గ్రామ స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

లావేరు : చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని లావేరు ఎపిఎం మాధవిలత అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేతుల పరిశుభ్రతపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడంతో అంటురోగాల నుంచి నివారించుకోవచ్చన్నారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి పాలిశెట్టి రమేష్, విఒఎ గాలి పావని, విఒ అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : డ్వాక్రా మహిళ సంఘాలకు రెండు రోజులు పాటు ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్లోబల్ హ్యాండ్ వాష్, బాల్యవివాహాలపై సామూహిక ప్రతిజ్ఞలు, విద్యా అవశ్యకతపై అవగాహన కల్పిస్తారని ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి స్వయం శక్తి సంఘాలకు అవగాహన కల్పించారు. ఎక్కువ మంది మహిళాలు, ప్రజలు, ప్రజాప్రతినిధులతో చేసి మంచి ఫొటోలు, వీడియోలు పెట్టడం ఎలా చేయాలి అన్నదానిపై సిబ్బందితో హ్యాండ్ వాష్ చేయించారు.

పలాస : విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని పలాస-కాశీబుగ్గ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రోణంకి హేమాచలం, కార్యదర్శి తమ్మినేని మాధవరావు అన్నారు. పలాస బిసి వసతి గృహం విద్యార్థులకు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన హ్యాండ్ వాష్ లిక్విడ్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.అప్పారావు, కొర్రాయి బాలకృష్ణ, పైల జవహర్, కొండలరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఏరియా కో-ఆర్డినేటర్ శిస్టు శ్రీరాములు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా టెక్కలి పంచాయతీ చేరి వీధి సాయిరాం ఆలయం ప్రాంగణంలో పరిసరాలను ప్రాముఖ్యతపై వివరించారు. అందరూ చేతులను శుభ్రంగా చేసుకోవాలన్నారు. ఎపిఎం జి.నారాయణరావు, సిసిలు కె.వరదరాజు, కె.పద్మావతి, బి.సరోజిని, బి.నేలవేణి పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : అవగాహన కల్పిస్తున్న మహిళా సంఘ సభ్యులు

ధర్మాన వ్యాఖ్యలు హాస్యాస్పదం

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ



అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎదుటివారికి చెప్పేందుకే నీతులు ఉన్నట్టు, అవేమీ ధర్మాన ప్రసాదరావు, జగన్మోహనరెడ్డికి వర్తించవన్నట్టు వేదికలపై ఊదరగొడుతున్నారని, కేవలం చంద్రబాబును దోషిగా ప్రజలను నమ్మించేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగా ఈ రకమైన ప్రచారానికి తెరతీశారని మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ విమర్శించారు. ఆదివారం అరసవల్లిలోని ఆయన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును అక్రమ పద్ధతిలో అరెస్టు చేసిన జగన్ ప్రభుత్వం ఆ తప్పును సరిపుచ్చుకునేందుకు విషప్రచారానికి తెర లేపారన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలు అందుకు అద్దం పడుతున్నాయన్నారు. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టి సిబిఐ కేసుల్లో జైలు కెళ్లిన జగన్, ఆయనకు సహరించి సంతకాలు పెట్టి కేసులో ఇరుక్కుని బయటపడ్డ ధర్మాన నీతి సూత్రాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబును అదే గాడిలో నిలబెట్టేందుకు లేని కేసును తెరపైకి తెచ్చి అక్రమ పద్ధతిలో జైలుకు పంపారన్నారు. ఎవరికైనా చట్టం ఒకటే అని చెపుతున్న మంత్రి ధర్మాన ఆ కేసుల నుంచి ఎలా తప్పించుకున్నారని ప్రశ్నించారు. ఆర్థిక నేరాల్లో సిబిఐ పలుమార్లు విచారించి నేరం జరిగిందని నిర్ధారించాకే జగన్‌ను జైలుకు పంపించారని, కానీ, చంద్రబాబును విచారించకుండా ముందు జైల్లో పెట్టి తర్వాత విచారణకు అప్పగించాలని కోరారన్నారు. అవినీతి నిరోధక న్యాయస్థానంలో న్యాయమూర్తులు చంద్రబాబుపై కేవలం అభియోగం మాత్రమే అని చెప్పడంలోనే ఈ కేసు ఎలా పెట్టారో అర్థమవుతుందన్నారు. చంద్రబాబుకు తప్పక ఉపశమనం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

అరసవల్లికి విఐపిల తాకిడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం జస్టిస్ వీరేంద్రకుమార్ జైన్ (ఫార్మర్ జడ్జి అలహాబాద్ హైకోర్టు, లక్నో బెంచ్) హైదరాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ బాలయోగి, విశాఖపట్నం మెరైన్ అడిషనల్ ఎస్పి మధుసూదనరావు కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. వారిని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి సేవలు జరిపించిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో వారికి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, చక్రవర్తి పాల్గొన్నారు. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ.2.02 లక్షలు శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.1,20,100లు, పూజలు, విరాళాల రూపంలో రూ.82,883, ప్రసాదాల రూపంలో రూ.1,75,000 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ వి. హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

ఘనంగా మహిళా కిసాన్ దివస్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని ఇసకలపాలెంలో మహిళా కిసాన్ దివస్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా మహిళలకు రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ పనుల్లో 60 శాతం వరకు మహిళలు సహాయం చేస్తున్నారని వెల్లడించారు. అయితే వారి హక్కులను పురుషులకు, స్త్రీలకు మధ్య వ్యత్యాసం వల్ల జీతం తేడా తదితర అంశాలపై ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా మంచి పోషకాహారాన్ని తింటూ వ్యవసాయ, పశు రంగాల్లో మహిళలు సాధికరతను సాధించాలన్నారు. బిటిఎం ఆత్మ ఎం. సౌమ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో స్త్రీ పాత్ర చాలా ముఖ్యమైనదని, విత్తనాలు విత్తడం మొదలుకొని కలుపు తీయడం, కోత కోయడం వరకు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిక్రా జి.శిల్ప, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ బి.రాజ్ కుమార్, మహిళా రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస: 11 కెవి బొడ్డేపల్లిపేట, 11కెవి అక్కులపేట ఫీడర్ పరిధిలో ఈ నెల 16న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్డేపల్లిపేట రోడ్డు వెడల్పు కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చుట దృష్ట్యా సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బొడ్డేపల్లిపేట సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ పరిధిలోని అక్కులపేట, మండాది, ఈసర్లపేట, గాజుల కొల్లివలస, జొన్నవలస, రామచంద్రాపురం, పొన్నాంపేట, మునగవలస, మున్సిపాలిటీ పరిధిలో బొడ్డేపల్లిపేట, వెంకయ్యపేట, లక్ష్ముడుపేట, తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, మండాది బ్రిక్ ఇండస్ట్రీ, పార్వతీశంపేట, మునగవలస స్టోన్ క్రషర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.



రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న మృతదేహం

రైల్వేస్టేషన్ ఆవరణలో మృతదేహం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ ఆవరణలో గడచిన రెండు రోజుల నుండి గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. రోజూ విధుల్లో ఉండే రైల్వే, జిఆర్‌పి పోలీసులు, పారిశుధ్య సూపర్ వైజర్ ఇలా పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు అటువైపు నుండే పలుమార్లు వెళుతున్నప్పటికీ కనీసం మృతదేహాన్ని పట్టించుకోకపోవడం పలువురు ప్రయాణికులు రైల్వే ఉద్యోగుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. మృతదేహం ఎండలో రెండు రోజుల నుంచి పడి దుర్వాసన వస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా రైల్వే స్టేషన్ నూతన నడక దారి బ్రిడ్జిపై ఓ గుర్తు తెలియని మృతదేహం రెండు రోజుల పాటు దుర్వాసనతో పడి ఉన్నా రైల్వే పోలీసులు పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. ఉన్నతాధికారులు వచ్చినప్పుడే స్థానిక అధికారులు హడావుడి చేస్తుంటారని ఆ తరువాత కనీసం పట్టించుకోరని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మృతదేహాన్ని పరిశీలించి అంత్యక్రియలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై జిఆర్‌పిఎఫ్ పోలీసులను వివరణ కోరగా రైల్వే ప్లాట్‌ఫారం, ట్రాక్ పరిధిలో తమకు సంబంధం ఉంటుందని రైల్వేస్టేషన్ బయట వైపున లోకల్ పోలీసు ఆదీనంలో ఉంటుందని తెలిపారు. దీనిపై స్థానిక ఎస్ఐ వై.కృష్ణను వివరణ కోరగా రైల్వేస్టేషన్ ఆవరణ తమ పరిధిలోకి రాదని, మెయిన్ రోడ్డు భాగంలో గానీ ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా తమకు సంబంధం ఉంటుందని తెలిపారు.

ఫొటోగ్రాఫర్ మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస



శ్రీనివాసరావు (ఫైల్)

మండలంలోని చీమలవలసకు చెందిన సనపల శ్రీనివాసరావు (53) శనివారం రాత్రి మృతి చెందారు. గడచిన 20 ఏళ్లుగా మండలంలో, పట్టణంలో ఫొటోగ్రాఫర్‌గా మంచి గుర్తింపు పొందారు. ఎంతోమంది యువకులను ఫొటో గ్రాఫర్లుగా తయారుచేసి ఉపాధి కల్పించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. దీంతో శనివారం రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఈయనకు భార్య లక్ష్మితో పాటు కుమార్తె ద్రాక్షాయని ఉన్నారు. కుమారులు లేకపోవడంతో బంధువులు తలకొరివి పెట్టేందుకు నిరాకరించడంతో భార్య లక్ష్మి భర్తకు తల కొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించారు.

పరుగు పోటీల్లో యామిని ప్రతిభ

ప్రజాశక్తి- పలాస



కాంస్య పతకంతో యామిని

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండకు అడప యామిని తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ నేషనల్ 3000 మీటర్లు పరుగు పోటీల్లో కాంస్య పతకం సాధించింది. యామిని ప్రస్తుతం పలాస ప్రభుత్వ ఐటిఐలో ప్రథమ సంవత్సరం చదువుతుంది. యామినికి కోచ్‌గా కణతాల రామారావు వ్యవహరించారు. యామినికి కాంస్య పతకం సాధించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఓర్వలేక తప్పుడు ఆరోపణలు

ప్రజాశక్తి- పొందూరు



వెంకట కృష్ణారావు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామాల్లో వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద, బడుగు, బలహీన వర్గాల అందరికీ సమానంగా సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా సంక్షేమ పథకాలను అందించలేదని, దీనిని ఓర్వలేక టిడిపి నాయకులు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని తెలిపారు. గోరింటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందనకు టిడిపి నాయకులు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.




అధ్వానంగా ఉన్న రోడ్డు

అధ్వాన రోడ్డుతో ఇబ్బందులు

లావేరు : మండలంలోని తాళ్ళవలస పంచాయతీలో పైడివారు వీధిలో రోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నాళ్లుగా రహదారికి ఇరువైపుల సిమెంట్ వీధి కాలువలు నిర్మించారు. ఆ సమయంలో తవ్విన మట్టిని రహదారిపై వేసెయ్యడంతో మొత్తం బురదమయంగా మారింది. దీంతో పెద్ద కుప్పలుగా మారి మట్టి బురదవ్వడంతో చిన్నపాటి వర్షం వచ్చిన నరకకూపంగా మారడంతో కాలనీవాసులు, గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'పాలవలస'కు అభినందనలు

కొత్తూరు : ఎమ్మెల్సీ పాలవల విక్రాంత్‌ను శాసన మండలి ప్రభుత్వ విప్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని పాలవలస స్వగృహానికి వైసిపి నాయకులు ఆదివారం తరలివెళ్లారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వి.సూర్యనారాయణ, లోతుగెడ్డ తిరుపతిరావు, పెద్దకోట సాధుబాబు, వై.ధర్మారావు, బి.శ్రీను, నాగేంద్రలు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

రమణ సేవలు స్ఫూర్తిదాయకం



రమణను సన్మానిస్తున్న ఆనంద్‌బాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత దేశరక్షణ రంగంలో భాగస్వామ్యులయ్యేలా వారు ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేలా వారిని అన్నివిధాలుగా సంసిద్ధులుగా తయారు చేయిస్తున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బి.వి.రమణ సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని విజయనగరం పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్పి టి.ఆనందబాబు కొనియాడారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మాతదేవోభవ స్వచ్ఛంద సంస్థ, ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల అగ్నిపథ్ ఫలితాల్లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థకు చెందిన 82 మంది ఎంపిక కావడం, వారికి ఆ విధంగా శిక్షణ అందించి ఉద్యోగాలు సాధించేలా కృషి చేసిన రమణ సేవలను కొనియాడుతూ అభినందనలు తెలియజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విజయనగరం సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మజ్జి కృష్ణారావు, లోక్‌సత్తా పూర్వ వేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, మాజీ ఎన్ఎస్‌జి అనీల్ పాల్గొన్నారు.

గిరిజనుల గోడు పట్టించుకునేదెవరు?



దూరప్రాంతం నుంచి రేషన్ తీసుకొస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- బూర్జ

దశాబ్దాలు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా తమ తలరాతలు మారడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు మారుతున్న ప్రతిసారి తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని ఎంతో ఆశ పడ్డ తమకు నిరాశ ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర సమయంలో తప్పని అవస్థలు

మండలంలోని అల్లిపల్లిగూడ గ్రామంలో సమస్యలు వేధిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుండి పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోడ్డు మొత్తం దమ్ముల మడిలా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రేషన్ వాహనం కూడా రావడం లేదన్నారు. ఎమర్జెన్సీ వాహనాలు కూడా రావటం లేదని, దీంతో కొంత వరకు ద్విచక్రవాహనంపై తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అలాగే గ్రామానికి కూడా 104, 108 వాహనాలు రావడం లేదని తెలిపారు. ముఖ్యంగా సీతంపేట ఐటిడిఎకు మహిళా పిఒ రావడంతో తమ సమస్యలను పట్టించుకుంటారని, పరిష్కరిస్తారని ఎంతో ఆశించామని అయితే ఆమె కూడా ఇంతవరకు పట్టించుకోలేదని బూర్జ మండలం ఆదివాసి సంక్షేమ పరిషత్ శోభన్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.

చంద్రబాబుకు కళింగ కోమట్ల మద్దతు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మాజీ సిఎం చంద్రబాబకు తోడుగా, మద్దతుగా కళింగ కోమటిలంతా గతంలో ఉన్నామని, ఇప్పుడూ ఉంటామని టిడిపి బిసి కళింగకోమటి సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేశారని, దీనికి కళింగ కోమటిలంతా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 78 ఏళ్ల వయసు ఉన్న చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగులేదని డాక్టర్లు చెబుతున్నా... ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, బిసి కళింగ కోమటి సాధికారిత రాష్ట్ర సభ్యులు బోయిన నర్సింహులు, పి.వి.రమణ, తంగుడు సంతోష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరాజులు

ఇదేనా... స్వచ్ఛతా సేవ?

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛత సేవా కార్యక్రమాలు విరివిగా చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సైతం ఎక్కడెక్కడ తూతూ మంత్రంగా చీపుర్లు, తట్ట బుట్టలు పట్టుకొని ఫొటోలకే పరిమితి కావడంతో రోడ్డు పక్కన చెత్త చెదారం కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రహదారులకు సమీపంలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో ప్రయాణికుల, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చినబడాం పాత జాతీయ రహదారి పక్కనే చెత్తా చెదారం పేరుకుపోవడంతో అటు వైపు వెళ్తున్న ప్రయాణికులు, వాహన చోదకులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలాస సీతమ్మతల్లి అమ్మవారి ఆలయం నుంచి జాతీయ రహదారి కంబిరిగాం కూడలి వైపు వెళ్తుండగా గెడ్డ ఆనుకొని రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు, చెత్తా చెదారం దుర్వాసన వస్తుందని ప్రయాణికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తా చెదారం ఆరుబయట పారేయ కూడదని మున్సిపల్ అధికారులు చెబుతున్నా కోళ్ల వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యర్థాలను రోడ్డు పక్కన పారవేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించాలని ప్రయాణికులు వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా ఆయా ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకు పోయిన విషయం నా దృష్టికి రాలేదని, మున్సిపల్ కార్మికులు, సిబ్బందితో చెత్తా చెదారాన్ని తొలగిస్తామని చెప్పారు. కోళ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించి వ్యర్థాలను ఆరుబయట పారేయకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



కంబిరిగాం కూడలి వద్ద నిల్వ ఉన్న చెత్త కుప్పలు

దసరా సెలవుల శిక్షణా శిబిరం ప్రారంభం



టెక్కలి : విద్యార్థులతో చదివిస్తున్న రూపవతి

లావేరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం దసరా సెలవుల శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి కథలు చదవడం, కథలు చెప్పడం, డ్రాయింగ్ తదితర అంశాల్లో పాల్గొని దసరా సెలవులను పూర్తిస్థాయిలో గ్రంథాలయానికి వచ్చి వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి టి.రాంబాబు ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మంచి అవకాశంగా మలుచుకోవాలన్నారు.

రణస్థలం: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి సూచించారు. ప్రతి ఆదివారం జరిగే చదవడం-మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ముందుగా దినపత్రికల పఠనం, కథలను చదివించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలుగా స్థానిక గ్రంథాలయాలు విరాజిల్లుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుండి గ్రంథాలయాలను సందర్శించడం అలవర్చుకోవాలన్నారు. పుస్తక పఠనం వలన ఎలాంటి ఒత్తిడినైనా అధిగమించి భవిష్యత్తులో జరిగే ఉపద్రవాలను అరికట్టవచ్చునన్నారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులు దసరా సెలవుల్లో గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థులు, యువకులు దసరా సెలవును సద్వినియోగం చేసుకునే క్రమంలో తమలో ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని టెక్కలి శాఖాగ్రంథాలయాధికారి బి.రూపవతి పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయంలో దసరా సెలవుల శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మన్ అమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులు చేరుకుని కథలు, పుస్తకాలు, నవలలు, పద్య పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.ఇందిర, సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం జెఆర్ పురం గ్రామంలో శ్రీదుర్గా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలు సందర్భంగా దుర్గా శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట తొలిపూజ కార్యక్రమానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, రణస్థలం మండలం జడ్‌పిటిసి టొంపల సీతారాం, జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జడ్‌పిటిసి కాయల రమణ, నాలుగు మండలాల పలు పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం గ్రామ దేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారు ఆలయంలో దసరా నవరాత్రులు ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రంగు రంగుల దీపాలతో ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం వేకువ జామున నుంచే యాత్రికులు తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టారు.

వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి- గార

మండలంలోని శ్రీకూర్మం ఆలయంలో యాత్రికులకు అవసరమైన వసతులు సౌకర్యాలను కల్పించేందుకు రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందుంటుందని ఆ క్లబ్ అధ్యక్షులు, న్యాయవాది యెరుకోల మురళీమోహనరావు తెలిపారు. శ్రీకూర్మనాథ క్షేత్రంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రజలతో పాటు వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, దేశ విదేశాల నుంచి శ్రీకూర్మం క్షేత్రాన్ని సందర్శించేందుకు తరలివస్తూ ఉంటారని తెలిపారు. ప్రపంచంలోనే ఏకైక కూర్మనాథస్వామి క్షేత్రం కావడం యాత్రికుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి అవసరమైన వివిధ వసతులను సమకూర్చనున్నట్లు చెప్పారు. ఈ విషయమై స్థానిక కూర్మనాథ క్షేత్రం సూపరింటెండెంట్, అర్చకులతో తాను మాట్లాడడానని అన్నారు. యాత్రికులు స్నానాలు చేసేందుకు తాగునీటి పైపులైన్లు, పెద్దలకు పిండ ప్రదానం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను తమ క్లబ్ తరపున ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ విషయాలను తమ క్లబ్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్వచ్ఛత పేరిట ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశామని అన్నారు. అసిస్టెంట్ గవర్నర్ కె.టి. నాయుడు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు కావాల్సిన ఎస్టిమేషన్స్ తయారు చేసి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కి పంపించే ఏర్పాటు చేస్తానని అన్నారు. వారి వద్ద నుంచి తగిన ఆర్థిక సహాయం అందేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ నర్సబాబు, క్లబ్ ప్రతినిధులు కెవిఎన్ దుర్గారావు, బరాటం శ్రీరామ్మూర్తి, పి.వాసుదేవరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, టి.వాసుదేవరావు, నాగేశ్వరరావు, ఎన్.వి.భాస్కరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న హారికా ప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: దేశం గర్వించదగ్గ ఆదర్శమూర్తి, సేవా స్ఫూర్తి, మేధాశక్తి స్వర్గీయ అబ్దుల్ కలాం అని వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలోని గాంధీ మందిరంలో ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు హారికా ప్రసాద్ హాజరై అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన జీవతం స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో వావిలపల్లి జగన్నాద నాయుడు, శాస్త్రి, టూరిజం నారాయణరావు, తర్లాడ అప్పలనాయుడు, బరాటం లక్ష్మణరావు, ఖాన్, బట్లు, గౌరునాయుడు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న తులసీదాస్‌రెడ్డి

బూర్జ: భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఆర్ట్స్ సంస్థ కార్యాలయం ఆదివారం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. భారత దేశంలో అనేక కీర్తి ప్రతిష్టలు, యువతకి ఆయన ఒక ఆదర్శమన్నారు. అలాగే భావితరాల్లో ఇలాంటి గొప్ప వ్యక్తి మనకి గొప్ప మార్గదర్శకమని పిలుపునిచ్చారు. జాతీయ మహిళా వ్యవసాయ దినోత్సవ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతుందన్నారు. మహిళలు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుందని, వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర చాలా కీలకమని, మహిళలు అభివృద్ధి చెందితేనే మనదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సిఇఒ బి.శంకరరావు, మన్యం సహజ రైతు ఉత్పత్తి, ఆర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం తాడివలస గ్రామంలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులు నివాళ్లర్పించారు. సీపాన అభయ్ రామ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకల్లో తాడివలస గ్రామస్తులతో పాటు అభయ్ రామ్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అబ్దుల్ కలాం భారతదేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

వజ్రపుకొత్తూరు : మాజీ రాష్ట్రపతి దేశానికి దార్శనికుడు అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపెల్లి లక్షణరావు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బూర్జ: విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సన్యాసిరావు

టెక్కలి : జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, నాయకులు అట్టాడ శ్రీధర్, కుమాం స్వామి, గవరయ్య, భాస్కర్, చంద్రమౌళిలు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో అబ్దుల్ కలాం చిత్రపటానికి చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్వర్ణ భారతి విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల నీల మరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్ : టెక్కలి జగతిమెట్ట జాతీయ రహదారిపై భార్యాభర్తలు గాయపడ్డాడు. కోటబొమ్మాళి మండలం గంగుపేటకు చెందిన భార్యాభర్తలు సదునపల్లి అచ్చయ్య, ఆదమ్మ టెక్కలి కూలీ పనులకు రోజు వస్తుంటారు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పనుల కోసం వస్తుండగా... వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ బుడ్డెపుపేటలో ఎస్‌సి కమ్యూనిటీ భవన నిర్మాణానికి జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీంతో సర్పంచ్ పిట్ట శశిరేఖ మామయ్య కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పూర్తికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నర్తు తేజయ్య యాదవ్, అసి పేరయ్య రెడ్డి, దక్కత హరి, మన్మథరావు, పురుషోత్తం, ఆదినారాయణ, వాలంటీర్ విజయ, విఆర్ఒ సోమయ్య పాల్గొన్నారు.

నాగేష్‌కు 'ఎస్‌జిఎఫ్' అండ

కవిటి: మండలంలోని శవసానపుట్టుగకు చెందిన ఈగల నాగేష్ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ మేరకు ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. గ్రామానికి చేరుకున్న సభ్యులు నాగేష్ కుటుంబ సభ్యులకు రూ.30 వేలు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేష్ వైదానికి రూ.20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, ప్రస్తుతం దయనీయ పరిస్థితిలో ఉన్న నాగేష్ కుటుంబ సభ్యులకు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



పలాస : పోస్టర్‌ను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముకాభివృద్ధి జరగనుందని మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని వంజంగి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, ప్రస్తుత వైసిపి పాలనలో ధరల భారాలపై ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన టిడిపి ప్రభుత్వంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలను పెంచలేదని, వైసిపి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నెత్తిన అధిక భారాన్ని వేశాడన్నారు. ప్రజలకు ఒక చేత్తో రూ.100 ఇచ్చి మరో చేత్తో వెయ్యి రూపాయలు లాగేసుకుంటున్నాడని ప్రజలకు వివరించారు. వైసిపి పాలన వైఫల్యాలపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రజల చరవాణి ద్వారా చంద్రబాబుకు మద్దతు తెలిపేందుకు 9261292612 నెంబర్ కి మిస్డ్ కాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో భీష్మ, రామారావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని అల్లుకోల, సవరగోవిందపురం గ్రామాల్లో ఆదివారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, కత్తుల లక్ష్మణ్, దువ్వాడ సంతోష్, రాంనాయుడు, మోహనరావు, పైల సూర్యనారాయణ, పైల గిరి, ఆర్.నాగేశ్వరరావు, గేదెల బాబూరావు, పోలయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి:

ఈ నెల 17 నుంచి 19 వరకు 19 నిర్వహిస్తుంచనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు మౌలిక సదు పాయాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు పల్లి కోటేశ్వరరావు, పాగోటి అనిల్ కుమార్‌లు కోరారు. ఈ మేరకు కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వహాణాదికారి వాకచర్ల రాధాకృష్ణను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మూడు రోజుల పాటు యాత్రికులకు ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేయాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు. అందుబాటులో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు టి. ప్రసాద్, ఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేటలో సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ తెలిపారు. రాపాక-దల్లవలస రహదారి నుండి ఇల్లయ్యగారిపేట వరకూ రూ.65లక్షలతో నిర్మించిన బిటి రహదారిని ప్రారంభించనున్నారు. అలాగే రూ.54లక్షలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన, అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సాయంత్రం 3గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.



నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సూర్యారావు

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం దల్లిపేట, పుల్లాజిపేటలో ఆల్బినా స్వచ్ఛంద సంస్థ గ్రామంలోని వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఆదివారం దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి ఈ దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కంబాపు సూర్యారావు, ఆల్బినా సంస్థ ప్రతినిధి దల్లి అచ్యుతరావు, వండాన అప్పలనాయుడు, రెడ్డి ఉమామహేష్, కొంచాడ ఉమా, రెడ్డి బాబూరావు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

200 మందికి వైద్య పరీక్షలు

పొందూరు మండలం కింతలి గ్రామంలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి పంచాయతీలో వైసిపి కార్యకర్తలు రుప్ప సింహాచలం, రుప్ప యర్రయ్యలపై అదే గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు మోహనరావు, శ్రీను తదితరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, వారికి కఠినంగా శిక్షించాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గాయపడిన క్షతగాత్రులు స్థానిక సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపిపి క్షతగాత్రులను ఆదివారం పరామర్శించారు. ఈయనతో పాటు కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేసుందరరాజు, పెద్దబమ్మిడి సర్పంచ్, ఎంపిటిసిలు మెండ తాతయ్య. మెండ జగన్‌లు ఉన్నారు.

'ఎండల మల్లన్న' ప్రచార వారోత్సవాలు

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలసలో ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం ప్రచార వారోత్సవాలు నిర్వహించారు. వారోత్సవాలకు టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.ప్రసాద్‌బాబు, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ పాల్గొన్నారు.